క్లుప్తంగా

ఘనంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

కోనరావుపేట: మల్కపేటలో సీతారామలక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు గ్రామంలో సుమారు రూ.3కోట్ల వ్యయంతో సీతారామాలయాన్ని నిర్మించారు. గురువారం నుంచి జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అగ్ని ప్రతిష్ఠ, పంచగవ్య ప్రోక్షణ, క్షీర, జలాధివాసాలు, అర్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, ఆలయ నిర్మాణ దాతలు చల్మెడ లక్ష్మీనర్సింహారావు-సునీల, వెంకటేశ్వర్‌రావు-కిరణ్మయి, రాజ్యలక్ష్మి, మధుసూదన్‌రావు-కవిత, కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, మల్కపేట గ్రామస్తులు పాల్గొన్నారు.

23న మండల సర్వసభ్య సమావేశం

ఎల్లారెడ్డిపేట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, అనధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులపై చర్చ ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలని అన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు


వేములవాడలోని పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వేములవాడఅర్బన్: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్ఎఫ్‌వో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. సిబ్బంది కమాలాకర్, యదయ్య, శంకర్, రాజేశం, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ముస్తాబాద్: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా 27 పాఠశాలలను గుర్తించామని ఎంపీడీవో భాస్కరశర్మ తెలిపారు. ఆయా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎలక్ట్రిసిటీ, తాగునీరు, మూత్రశాలలు, కిచెన్ వంటి మౌలిక వసతుల కల్పనకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వసతుల కల్పనకు పనులు ప్రారంభించామన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న శంకరయ్య


బోయినపల్లి: తడగొండ గ్రామ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలకు మజ్జిగ ప్యాకెట్లను శుక్రవారం గ్రామానికి చెందిన కొండ శంకరయ్య పంపిణీ చేశారు. మండుటెండలో రైతులు, హమాలీలు ధాన్యం కొనుగోలు కేంద్రంలో శ్రమిస్తుండగా.. కొండ శంకరయ్య అందించిన మజ్జిగ వారికి కొంత ఉపశమనం కలిగించింది.

పేద మిత్రుడికి చేయూత


నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నారాయణపూర్‌కు చెందిన పంతంగి శ్రీనివాస్ అనే వ్యక్తి నాలుగేళ్లుగా పక్షవాతంతో అనారోగ్యానికి గురై ఇంట్లోనే ఉంటున్నాడు. ఇటీవల తన కూతురి వివాహం నిశ్చయమైంది. పేదరికం అనుభవిస్తున్న శ్రీనివాస్ పరిస్థితి తెలుసుకున్న అప్పటి 1988–89 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు కలిసి రూ.50వేల నగదుతోపాటు 50 కిలోల బియ్యం, పుస్తెమెట్టెలు అందజేశారు.

కౌన్సిలర్ ఔదార్యం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లకు చెందిన కౌన్సిలర్ కల్లూరి రాజు నిరుపేద వివాహానికి చేయూతనందించారు. సుందరయ్యనగర్‌కు చెందిన నిరుపేద వధువు మనీషాకౌర్ వివాహం సందర్భంగా శుక్రవారం కుటుంబాన్ని ఆయన కలిశారు. తనవంతు సాయంగా 50 కిలోల బియ్యాన్ని అందించారు. వార్డు పెద్దలు వెంకటేశ్, అంబదాసు తదితరులున్నారు.

గరుడ వాహనంపై సీతారామచంద్రస్వామి



ఎల్లారెడ్డిపేట: నారాయణపూర్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ వాహనంపై గ్రామ పుర వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 7 గంటలకు నిత్యహవనం, బలిహరణం, నివేదన, తీర్థగోష్ఠి, ఉదయం 8 గంటలకు గరుడ వాహనంపై ఊరేగింపు నిర్వహించారు. శనివారం పెద్ద రథంపై స్వామివారిని ఊరేగించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అదేరోజు రాత్రి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని అర్చకుడు శ్రీవేణుగోపాలచారి తెలిపారు. మాజీ సర్పంచులు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, ఎంపీటీసీ అపెరా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

సుద్దాలలో సినీ ఫైటర్ల సందడి


రామ్, లక్ష్మణ్

కోనరావుపేట: సుద్దాలలో సినీ ఫైటర్లు రామ్, లక్ష్మణ్ సందడి చేశారు. జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ రిసెప్షన్ వేడుకలు కోనరావుపేట మండలం సుద్దాలలో జరిగాయి. ఈ కార్యక్రమానికి సినీ ఫైటర్లు రామ్, లక్ష్మణ్ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. గ్రామస్తులు వారితో ఫొటోలు దిగడానికి పోటీ పడడంతో సందడి నెలకొంది. జేఎన్టీయూ హెచ్ఏడీపీ డైరెక్టర్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌రావు, విద్యార్థి సంఘాల నాయకులు హాజరయ్యారు.

మాన్వాడలో శ్రీవేంకటేశ్వర కల్యాణం


కల్యాణ వేడుకల్లో వినోద్‌కుమార్ దంపతులు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీరాజరాజేశ్వర(మిడ్ మానేరు) ప్రాజెక్టు నిర్మాణ గ్రామమైన మాన్వాడ గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారి కల్యాణం తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం మహిళలు ఒడిబియ్యం పోశారు. వేడుకలకు బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్-మాధవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొండయ్య, చెన్నాడి అమిత్‌కుమార్, వైస్ ఎంపీపీ నాగయ్య, ఎంపీటీసీ గీతారెడ్డి, మాజీ ఎంపీపీ భాగ్యలత తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం.. పట్టని అధికార గణం


తహసీల్ కార్యాలయం ఆవరణలో ప్లాస్టిక్


డ్రైనేజీలో ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లు

- దుకాణాలు, హోటళ్లలో విచ్చలవిడిగా వినియోగం
- రోగాలబారిన జనం
- ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కరువు

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్లాస్టిక్‌మయంగా మారింది. ఎక్కడ చూసినా వ్యర్థాలే కనిపిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది వీధుల్లో చెత్త ట్రాక్టర్లు, ఆటోలు తింపుతున్నా.. కొన్ని వార్డులకు ఆ వాహనాలు వెళ్లడం లేదు. దీంతో ప్రజలు వాడిన ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలను డ్రైనేజీలు, రోడ్డుపై పారేస్తున్నారు.

యథేచ్ఛగా వినియోగం

ముస్తాబాద్‌లో హోటళ్లు, దుకాణాలు, ఇతర వాణిజ్య దుకాణాల్లో ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను ఇష్టారాజ్యంగా వినియోగిస్తున్నారు. హోటళ్లలో ప్లాస్టిక్ టీ కప్పులు వినియోగిస్తే రోగాలబారిన పడతారని అధికారులు మొత్తుకున్నా.. వినే నాథుడే లేడు. టీ కప్పులను కొంతమంది హోటల్ నిర్వాహకులు రోడ్లపైనే పారేస్తున్నారు. టిఫిన్ సెంటర్లలో పార్శిళ్లకు పాలిథిన్ కవర్లనే వినియోగిస్తున్నారు. కిరాణ దుకాణాల్లో ఏ సరుకులు కావాలన్నా పాలిథిన్ కవర్లోనే ఇస్తున్నారు. రెండేళ్ల క్రితం పంచాయతీ అధికారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగించినవారికి జరిమానాలు విధించారు. ఏడాదిన్నరగా ఇది తిరిగి కొనసాగుతోంది.

ఫంక్షన్లలోనూ..

ఎవరి ఇంట్లో ఏ పండుగ వచ్చినా గుట్టల కొద్ది ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పేరుకుపోతున్నాయి. భోజనాలు, టిఫిన్లకు ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు ఉపయోగిస్తున్నారు. అసలు విస్తరాకులు ఎక్కడా కనిపించడం లేదు. దేవాలయాల్లోనూ ప్లాస్టిక్ ప్లేట్లు కనిపించడం చూస్తే.. ప్లాస్టిక్ ఏ మేరకు విస్తరించి ఉందో అర్థం చేసుకోవచ్చు. ఫంక్షన్ హాళ్లలోనూ ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు వినియోగిస్తున్నారు. పలు వీధుల్లో కొంతమంది ప్రజలు ప్లాస్టిక్, చెత్త కుప్పలను చూసి భరించలేక నిప్పు పెడుతున్నారు. ఇది మరింత ప్రమాదకరమని వైద్యులంటున్నారు.

చెత్త కేంద్రాలివే..

ముస్తాబాద్‌లో సింగిల్‌విండో కార్యాలయం వెనక ఉన్న ఖాళీ ప్రదేశంలోకి మురుగు కాల్వల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలు కొట్టుకువస్తున్నాయి. సంచులు, గ్లాసులు, ప్యాకెట్లను మోరీల్లో పడేయడంతో.. అవి ఊరి చివరన పొలాలకు చేరుతున్నాయి. పోతుగల్ దారిలో మానేరు కెనాల్ కూడా వ్యర్థాలతో నిండిపోయింది. వేంకటేశ్వర ఆలయం, పల్లె మీది వీధుల నుంచి వచ్చే డ్రెయినేజీలు నేరుగా పెద్ద చెరువులో కలవడంతో.. అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. మొర్రాయిపల్లె, మద్దికుంట, సిద్దిపేట, కామారెడ్డి రహదారులు ప్లాస్టిక్‌తో కనిపిస్తున్నాయి.

పొగతో ఇబ్బంది



సిద్దిపేట రహదారిలో ఉన్న మా కాలనీలో చెత్తను కాల్చుస్తున్నరు. ఊపిరి తీసుకుందామంటే ఇబ్బందిగా ఉంది. పంచాయతీ వారు ఇటువైపే చెత్తను డంపింగ్ చేస్తున్నరు. దుర్వాసన అత్తంది. మా ఇళ్ల వద్దే చెత్త పాడేస్తున్నరు.

– కొనేటి శివ, ముస్తాబాద్

స్వచ్ఛభారత్ పాటించాలి



స్వచ్ఛభారత్ ప్రతి ఒక్కరూ పాటించాలి. ఎవరికి వారు తెలుసుకొని ప్లాస్టిక్ వ్యర్థాలను ఆరుబయట వేయొద్దు. పంచాయతీ అధికారులు, సిబ్బందికి సహకరించాలి. అధికారులు కూడా నిత్యం పర్యవేక్షణ చేయాలి. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను అందరికీ చెప్పాలి.

– కామిటికారి పద్మ, మాజీ ఎంపీటీసీ

అందరూ సహకరించాలి



మేజర్ పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధాన్ని కొనసాగిస్తున్నాం. గతంలో పలువురికి జరిమానాలు కూడా విధించాం. దుకాణాలు, హోటళ్లలో పాలిథిన్ కవర్లు వినియోగిస్తే చర్యలు తీసుకుంటాం. బయట వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పిస్తాం.

– బి.రాజు, పంచాయతీ కార్యదర్శి, ముస్తాబాద్

గురువు ఉద్యోగ విరమణకు హాజరైన ఏపీడీ


మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ రాష్ట్ర ఏపీడీ రమేశ్

బోయినపల్లి(చొప్పదండి): చిన్నతనంలో ప్రాథమిక స్థాయిలో విద్యను అందించిన గురువు ఉద్యోగ విరమణ సభకు సర్వశిక్షాభియాన్ రాష్ట్ర అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ గాజర్ల రమేశ్ హాజరయ్యారు. నర్సింగాపూర్ హైస్కూల్‌లో ఎం.లక్ష్మారెడ్డి సోషల్ సబ్జెక్టులో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. శుక్రవారం నర్సింగాపూర్ హైస్కూల్‌లో విరమణ సభలో గాజర్ల రమేశ్ మాట్లాడుతూ.. గురువు విరమణకు రావడం ఆనందంగా ఉందన్నారు. డీఈవో రమేశ్ మాట్లాడుతూ.. లక్ష్మారెడ్డి 35 ఏళ్లు సుదీర్ఘంగా సేవ చేశారని కొనియాడారు. ఎంఈవో శ్రీనివాసదీక్షిత్, బన్నాజీ, ప్రధానోపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, బొల్గం శ్రీనివాస్, ఏసీజీ వెంకటేశ్వర్లు, గసికంటి శ్రీనివాస్, అనిల్‌కుమార్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనలో సేవలు మరువలేనివి


పురుషోత్తంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్లఎడ్యుకేషన్: అక్షర జ్ఞానం అందించి పేద పిల్లలకు అండగా నిలిచి విద్యాబోధనలో సుదీర్ఘ కాలం పని చేసిన ఉపాధ్యాయుడి సేవలు మరువలేమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. శివనగర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పని చేస్తున్న మల్లారపు పురుషోత్తం ఉద్యోగ విమరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి ఉపాధ్యాయులు హాజరయ్యారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు ఎ.రమేశ్, కోశాధికారి పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దలింగాపూర్‌లో జాతీయ సేవాపథకం ప్రత్యేక శిబిరం


శిబిరంలో వ్యవసాయ విద్యార్థులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో శుక్రవారం బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకం(ఎన్ఎస్ఎస్) ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు విద్యార్థులు తెలిపారు. గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో ఎం.సురేష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, అసోసియేట్ డీన్ ఇన్‌చార్జి రజియా సుల్తానా, కోఆర్డినేటర్ మదన్మోహన్‌రెడ్డి, కార్యదర్శి రంజిత్, అధికారులు అరుణ్‌బాబు, భవ్యశ్రీ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి


జిల్లెల్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో వెంటనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, హమాలీ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పంతం రవి అన్నారు. శుక్రవారం జిల్లెల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో రైస్ మిల్ యజమానులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో చేతులు కలిపి ఒక్కో బస్తాకు ఆరు నుంచి ఏడు కిలోల వరకు తరుగు పేరుతో దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమ నాగరాజు, నాయకులు బచ్చుపల్లి శంకర్, శ్రీను, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ.. నీరంతా వృథా


నీటి ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీరు

రుద్రంగి: వేసవి ఎండలు మండుతూ నీటి కొరత ఏర్పడుతున్న ఈ తరుణంలో రుద్రంగి మండల కేంద్రంలో మిషన్ భగీరథ నీరంతా వృథాగా పోతోంది. లింగంపేటపల్లె తెనుగుకాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిండినా.. సిబ్బంది నిర్లక్ష్యంతో మోటార్ ఆఫ్ చేయకపోవడంతో ట్యాంకు నిండి నీరు వృథాగా పోతోంది. ఇలా ప్రతిరోజు జరుగుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వృథాగా పోతున్న నీటితో దారి మొత్తం చిత్తడిగా మారి నడవడానికి వీల్లేకుండా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల నీటి కొరత ఉందని, నీటి సరఫరా చేయాలని కోరుతున్నారు. మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా తక్కువ.. లీకేజీలు ఎక్కువ అన్న చందంగా ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎక్కడ చూసినా లీకేజీలే కనపడుతూ నీరంతా వృథాగా పోతూ రోడ్లు బురదమయమవుతున్నాయని వారు వాపోతున్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి


కోనరావుపేటలో మాట్లాడుతున్న నాయకులు

కోనరావుపేట: వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా కోరారు. కోనరావుపేట మండల కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వేములవాడలోని రాజశ్రీ గార్డెన్‌లో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీటీసీ చారి, జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్, చేపూరి గంగాధర్, మానుక సత్యం, ఎల్లయ్య, గొట్టె రుక్మిణి, వెంకన్న, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: వేములవాడ పట్టణంలో మల్లారం రోడ్డులో గల రాజశ్రీ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ స్థాయి సమావేశానికి చందుర్తి మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని చందుర్తి మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి కోరారు. శుక్రవారం చందుర్తి మండల కేంద్రంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, నాయకులు గొట్టె ప్రభాకర్, భీంరాజు కనకరాజు, దారం చంద్రం, పులి సత్తయ్య, వెల్పుల దేవస్వామి, ధర్మపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఎల్లారెడ్డిపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడిగా ఎడ్ల సందీప్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సందీప్‌ను ఆగయ్య సన్మానించారు. బోయినపల్లి వినోద్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని దిశానిర్దేశం చేశారు. మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు పిల్లి కిషన్, పందిర్ల పర్శరాములుగౌడ్, ఎనగందుల నర్సింలు, గంట బాలగౌడ్, మీసం రాజం, బందారపు బాల్‌రెడ్డి, బాబు, అజ్జు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఆర్‌లో యోగా శిక్షణ


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండెపల్లి ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్(ఐటీడీఆర్)లో విద్యార్థులకు ఆదియోగి యోగా సాధన ఆలయం యోగా గురువు ఉప్పల శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా శిక్షణ ఇచ్చారు. డ్రైవింగ్ శిక్షణ పొందుతున్న యువకులు యోగాసనాలు వేశారు. ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ.. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగవుతుందని అన్నారు.

మట్టి టిప్పర్ పట్టివేత

వేములవాడఅర్బన్: అనుపురం పాత గ్రామంలోని మిడ్ మానేరు ముంపునకు గురైన భూముల్లో మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత తెలిపారు. ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: రాగట్లపల్లి పాత వంతెన వద్ద శుక్రవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పదిరకు చెందిన బుచ్చిరెడ్డి అనే వ్యక్తి ఉదయం ఎల్లారెడ్డిపేటకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా.. ఎదురుగా మరో వాహనం వేగంగా రావడంతో అదుపుతప్పి కింద పడ్డాడు. అక్కడున్న వాహనదారులు బుచ్చిరెడ్డిని ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

యువత స్వయం ఉపాధి పొందాలి


చందుర్తిలో ఫుడ్ కోర్టు ప్రారంభిస్తున్న విప్ ఆది

చందుర్తి: యువత ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఫుడ్ కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీ ప్రపంచంలో ఉద్యోగాన్ని సాధించడం కన్న ఉపాధి మార్గాలను ఎంచుకొని పలువురికి ఉపాధి చూపడమే ఉత్తమమన్నారు.

ఎల్లమ్మ బోనాలకు రండి

బోయినపల్లి(చొప్పదండి): కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఈనెల 21న జరిగే ఎల్లమ్మ బోనాల వేడుకలకు హాజరు కావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను శుక్రవారం గ్రామ గౌడ సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు.

కేకే మహేందర్‌రెడ్డికి ఆహ్వానం

తంగళ్లపల్లి: సారంపల్లి గ్రామంలో ఈనెల 28న జరిగే పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణ మహోత్సవానికి రావాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని ముదిరాజ్ సంఘ నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం కేకేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడఅర్బన్: పట్టణంలోని ఏఐటీయూసీ మేడే పిలుపు పోస్టర్‌ను శుక్రవారం నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. లేబర్ అడ్డాపై 138వ మేడే కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కదారి రాములు, దేవరాజు, నర్సయ్య, అంజన్న, మల్లేశం తదితరులున్నారు.

ప్రాచీన కళలను ఆదరించాలి

కోనరావుపేట: ప్రాచీన కళలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. కనగర్తిలో శ్రీవేణుగోపాలస్వామి కళామండలి ఆధ్వర్యంలో చిరుతల రంభ రంపాల నాటక ప్రదర్శన నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం

చందుర్తి: బీజేపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై నాయకుడు లోకొటి సతీశ్ ఆధ్వర్యంలో శుక్రవారం మల్యాల గ్రామంలో గడపగడప ప్రచారాన్ని చేపట్టారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ శుక్రవారం తంగళ్లపల్లి బీజేపీ నాయకులు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సందెవేని రాజు యాదవ్, సిరిసిల్ల వంశీ, కోడం భవిత తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి

తంగళ్లపల్లి: జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. బద్దెనపల్లిలో నర్సరీ, డంపింగ్ యార్డు, పల్లె ప్రగతి యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద శాతం నీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో(ఎఫ్ఏసీ) జోగం రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.